సాక్షి మెదక్

ఆదివారం । 25 । మే । 2025

సండే స్పెషల్

ఆఖరి మజిలీకి ఆపన్న హస్తం

జరా మరణాలు మానవాళికి సహజాతమైనా చావును కీడని నమ్మే మూఢవిశ్వాసులకు ఈ సమాజంలో కొదవలేదు. నాగరికత పెరిగేకొద్దీ అంతేవాసిలో మానవత్వం పరిమళించాల్సిందిపోయి అమానవీయతకు దర్పణంగా నిలుస్తోంది సమాజం. పట్టణాలు,నగరాలే కాదు గ్రామాల్లో కూడా అద్దె ఇంటిలో ఎవరైనా మరణిస్తే కనీసం వారిని ఇంటికి తీసుకొచ్చేందుకు కూడా చాలామంది ఒప్పుకోని పరిస్థితులున్నాయి. అటువంటి వారికి మేమున్నామంటూ అంత్యక్రియలు మొదలు కర్మ కాండల వరకు ఆపన్నహస్తం అందిస్తోన్న సిద్దిపేటలోని 'శ్రీరామ వైకుంఠధామం'పై 'సాక్షి' సండే స్పెషల్.

: సిద్దిపేట జోన్

8లో



వైకుంఠధామం భవనంలో బాధితులకు చెక్కు, నిత్యావసరాలు అందజేస్తున్న యువ వర్తక సంఘం ప్రతినిధులు

న్యూస్‌రీల్

మిగిలిన సీట్ల భర్తీకి 27న కౌన్సెలింగ్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల కాలేజీలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 27న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రాయ్ తెలిపారు. మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేస్తామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకొని రావాలన్నారు. ఇతర వివరాలకు 8790724953, 8639898246 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గోహత్యలను అరికట్టండి



కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న బీజేవైఎం నేతలు

మెదక్‌జోన్: గోవుల అక్రమ రవాణాను అరికట్టి గోహత్యలు జరగకుండా చూడాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ అన్నారు. ఈ మేరకు శనివారం పలువురు కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్, మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా చుట్టూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి గో అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నేతలు బబ్బులు, సాయి, రాహుల్, ప్రశాంత్, పండరి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యల బలోపేతానికి చర్యలు

రామాయంపేట(మెదక్): మహిళా సమాఖ్యల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని డీపీఎం జాన్ కెన్నడీ అన్నారు. శనివారం రామాయంపేటలోని ఐకేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రేణుక, కార్యదర్శిగా హారిక, కోశాధికారిగా రచన ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీఎం రాములు, సీసీలు వెంకట్రాములు, అమృత, చెన్నమ్మ, అకౌంటెంట్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కేవీకేలో ఫార్మర్ హాస్టల్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ డాక్టర్ పీవీరావు తదితరులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి కేవీకేలో రూ. 84 లక్షలతో నిర్మిస్తున్న ఫార్మర్ హాస్టల్ పనులను శనివారం ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) చైర్మన్ డాక్టర్ పీవీరావు పరిశీలించారు. ఎక్సాన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనుల నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో కేవీకే కోశాధికారి రాఘవరావు, కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, సైట్ ఇంజనీర్ జానకీరాం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత 'వరి' గోస



జాతీయ రహదారిపై రైతుల ఆందోళన

హవేళీఘణాపూర్(మెదక్): ధాన్యం కొనాలని మాచవరం గ్రామానికి చెందిన అన్నదాతలు రోడ్డెక్కారు. శనివారం మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. ధాన్యం కుప్పలు పోసి రోజుల తరబడి ఎదురుచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి వడ్లు తడిసి మొలకెత్తితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పకడ్బందీగా నిర్వహించాలి

మెదక్‌జోన్: గ్రామపాలన అధికారి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. ఇదే విషయమై శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఆర్డీఓ రమాదేవి, కలెక్టరేట్ ఏఓ యూనస్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్, డీఆర్వో భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు స్లో!

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. సెంటర్లు ప్రారంభించి రెండు నెలలు కావొస్తున్నా వడ్ల సేకరణ పూర్తి కాకపోవడంతో రైతులు రోజుల తరబడి కల్లాల వద్దే జాగారం చేస్తున్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి మొలకెత్తుతుండటంతో అరిగోస పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు.

– మెదక్‌జోన్



చిన్నశంకరంపేట: అంబాజీపేటలో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

జిల్లాలో మందకొడిగా ధాన్యం సేకరణ

- వెంటాడుతున్న అకాల వర్షాలు
- ఇంకా 1.20 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రాల్లోనే..
- ఆందోళనలో అన్నదాతలు

జిల్లావ్యాప్తంగా యాసంగిలో 2.95 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, కొనుగోలు కేంద్రాలకు 3.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకనుగుణంగా జిల్లాలో 498 సెంటర్లను ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించారు. అందులో 92 కేంద్రాలను ప్రత్యేకంగా సన్నధాన్యం సేకరణ కోసం, 406 సెంటర్లను దొడ్డు ధాన్యం కోసం ఏర్పాటు చేశారు. కాగా దొడ్డు రకం ధాన్యం కోసం ఏర్పాటు చేసిన 406 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు 155 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి చేశారు. సన్నాల సేకరణ కోసం ఏర్పాటు చేసిన 92 కేంద్రాలు అలాగే కొనసాగుతున్నాయి.

సేకరించింది 2.60 లక్షల మెట్రిక్ టన్నులు

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నేటికీ 55 రోజులు అయింది. ఇప్పటివరకు రైతుల నుంచి 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. అందులో దొడ్డురకం 2,14,634 మెట్రిక్ టన్నులు కాగా, సన్నాలు 46,110 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి రూ. 426.52 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

జిల్లా వివరాలు
ఇప్పటివరకు సేకరించిన ధాన్యం
2.60 లక్షల మెట్రిక్ టన్నులు
ఇంకా కొనాల్సింది
1.20 లక్షల మెట్రిక్ టన్నులు
పూర్తయిన సెంటర్లు 155

బోనస్ డబ్బులు ఎప్పుడో..?

కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్ ధాన్యానికి రూ. 2,320 చొప్పున మద్దతు ధర చెల్లిస్తుండగా, సన్న ధాన్యం కోసం ప్రభుత్వం అదనంగా ఇచ్చే క్వింటాల్‌కు రూ. 500 బోనస్ డబ్బులు మాత్రం ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. సన్నధాన్యం 46,110 మెట్రిక్ టన్నులు రైతులు కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించారు. ఇందుకు సంబంధించి క్వింటాల్‌కు రూ. 2,320 చొప్పున మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ కలిపితే క్వింటాల్‌కు రూ. 2,820 అవుతుంది. అయితే బోనస్ డబ్బులు ఇవ్వకుండా కేవలం మద్దతు ధరను మాత్రమే రైతు ఖాతాల్లో జమచేస్తున్నారు. ఇప్పటివరకు విక్రయించిన ధాన్యానికి రైతులకు చెల్లించాల్సిన బోనస్ డబ్బులు రూ. 23.6 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని ఎప్పుడు చెల్లిస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత వానాకాలంలోనూ బోనస్ డబ్బుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరగటంతో అన్నదాతలు ఇబ్బంది పడ్డారు. ఈసారి అలా కాకుండా సకాలంలో చెల్లించాలని కోరుతున్నారు.

వారంలో పూర్తి చేస్తాం: కలెక్టర్

చిన్నశంకరంపేట(మెదక్): మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శనివారం మండలంలోని అంబాజీపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులకు వెంట వెంటనే డబ్బులు జమ చేస్తున్నట్లు చెప్పారు. సన్న వడ్ల బోనస్ కూడ త్వరలో అందనుందని వివరించారు. అదనంగా హమాలీలతో పాటు 150 లారీలను సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మన్నన్ ఉన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

జూనియర్ సివిల్ జడ్జి హేమలత



అధికారులు, న్యాయవాదులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్జి హేమలత

నర్సాపూర్: మండల లీగల్ సర్వీస్ కమిటీ నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జూనియర్ సివిల్ జడ్జిహేమలత ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కోర్టు పరిధిలోని ఆయా మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలతో పాటు పలుశాఖల అధికారులతో కోర్టులో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల లీగల్ సర్వీస్ కమిటీని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వాటిని లీగల్ సర్వీస్ కమిటీ ప్రీ లిటిగేషన్ కేసుగా నమోదు చేసి సంబంధిత మండలస్థాయి అధికారులకు, వ్యక్తులకు నోటీసులు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సకాలంలో స్పందించకపోతే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



పిల్లలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న టీచర్లు

అనాథలకు ఆర్థిక సహాయం

సాక్షి ఎఫెక్ట్

పాపన్నపేట(మెదక్): 'బడికి సెలవులంటేనే భయం' శీర్షికన గతంలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి టీచర్లు స్పందించారు. శనివారం కుర్తివాడలోని పిల్లలు లావణ్య, అనురాధ, నవీన్ వద్దకు వెళ్లి రూ. 26 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పీఆర్టీయూ పాపన్నపేట శాఖ పిలుపు మేరకు మండల ఉపాధ్యాయులంతా తలా కొంత పోగు చేసి ఆర్థిక సహాయం చేశారు. పిల్లల కనీస అవసరాల కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పీఆర్టీయూ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి సురేష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అంజనాచారి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కార్యదర్శి జనార్దన్, జిల్లా కార్యదర్శి స్వామి, మండల అసోసియేట్ అధ్యక్షుడు సంతోష్ కుమార్, మండల కార్యదర్శి నాగేశ్వర్, సాయిలు, మధుసూదన్, సీఆర్పీ దేవయ్య పాల్గొన్నారు.

బేస్‌మెంట్ పూర్తికాగానే డబ్బులు

జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం



ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ మాణిక్యం

కౌడిపల్లి(నర్సాపూర్)/కొల్చారం: ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులకు బేస్‌మెంట్ పూర్తి అయిన వెంటనే మొదటి బిల్లు అందజేస్తున్నామని జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం తెలిపారు. శనివారం కౌడిపల్లిలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 120 ఇళ్లకు మొదటి విడత రూ. 1 లక్ష చొప్పున లబ్ధిదారుల ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 400 నుంచి 600 ఫీట్లలోపు ఇల్లును నిర్మించుకోవాలని సూచించారు. కాగా ఎక్కువ విస్తీర్ణంలో బేస్‌మెంట్ నిర్మించిన వారికి సైతం ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. బేస్‌మెంట్ పరిధి ఎక్కువగా ఉన్న గోడలు 600 ఫీట్లలోపు నిర్మించే విధంగా అంగీకార పత్రం రాసిస్తే మొదటి విడత బిల్లు మంజూరు చేస్తామని వివరించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ బలరాం ఉన్నారు. అనంతరం కొల్చారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, మాజీ జాతీయ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వరప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన సంవిధాన్ బచావో ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పార్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. అనంతరం గ్రామ, మండల స్థాయి కమిటీల కోసం అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి తదితరులు హాజరయ్యారు.

చెక్కుల పంపిణీ రసాభాస

- ఎమ్మెల్సీ యాదవరెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

తూప్రాన్: పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో రసాభాస చోటు చేసుకుంది. ముందుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను మాజీ సీఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారని తెలిపారు. దీంతో కేసీఆర్ విషయం ఈ సమావేశంలో చర్చించవద్దని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ ప్రసంగానికి అడ్డుపడ్డారు. దీంతో కాసేపు రసాభాస చోటు చేసుకుంది. దీంతో ఎమ్మెల్సీ తన ప్రసంగాన్ని అర్ధాంతరంగా ఆపేశారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, సుహాసినిరెడ్డి, నర్సారెడ్డి



కౌన్సెలింగ్ కోసం వేచిచూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అడ్మిషన్ ఫ్లీజ్

కిక్కిరిసిన తునికి ఎంజేపీ



విద్యార్థికి అలాట్‌మెంట్ ఆర్డర్ ఇస్తున్న ఆర్‌సీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం మండలంలోని తునికి ఎంజేపీ (మహాత్మ జ్యోతిబా పూలే) బీసీ గురుకులంలో శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీఓ గౌతంకుమార్‌రెడ్డి, గురుకుల ప్రిన్సిపాల్ హరిబాబు ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో మొత్తం 979 బ్యాక్‌లాగ్ సీట్లు ఉండగా, ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కౌన్సెలింగ్ కోసం వచ్చిన వారి వాహనాలు జాతీయ రహదారికి ఇరువైపులా నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

తూకంలో గోల్‌మాల్‌పై విచారణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గుండ్లపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో గోల్‌మాల్‌పై అధికారులు శనివారం విచారణ చేపట్టారు. తూకంలో సెంటర్ ఇన్‌చార్జి చంద్రకళ అవకతవకలకు పాల్పడ్డారని ఇటీవల రైతులు ఆందోళనకు దిగారు. అదే రోజు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్ గ్రామంలో రైతుల సమక్షంలో విచారణ చేపట్టి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించారు. వారి ఆదేశాల మేరకు శనివారం సీనియర్ ఆడిటర్ లాలునాయక్, ఏపీఎం వెంకటేశ్వర్లు విచారణ చేశారు. వీఓ అకౌంట్‌తో పాటు శ్రీనిధి, ధాన్యం తూకానికి సంబంధించి ట్రక్‌షీట్, పలు రికార్డులు పరిశీలించారు. తూకంలో 4 క్వింటాళ్ల వ్యత్యాసం జరిగిందని, అందుకు సంబంధించిన రైతులకు సెంటర్ ఇన్‌చార్జి డబ్బులు చెల్లించిందని ఏపీఎం తెలిపారు.

పట్టుకుంటేే బంగారమే!

సాంప్రదాయ వ్యవసాయంతో నష్టాలు చవిచూస్తున్న రైతులు మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకంతో ప్రతి నెల ఆదాయం ఆర్జించవచ్చు. తక్కువ సమయంలోనే అధికంగా లాభాలు పొందవచ్చు. అయితే జిల్లాలో కేవలం మల్బరీ సాగు 95 ఎకరాల్లో ఉండగా, పట్టు పురుగుల పెంపకానికి 20 షెడ్లు మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా చిన్న, సన్నకారు రైతులు సబ్సిడీలతో పాటు, తక్కువ పనితో ఎక్కువ ఆదాయం ఆర్జించే పట్టు పురుగుల పెంపకంపై ఆసక్తి చూపాలని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

– చిలప్‌చెడ్(నర్సాపూర్)



చిలప్‌చెడ్‌లో సాగవుతున్న మల్బరీ తోట

జిల్లాలో 95 ఎకరాల్లో మల్బరీ సాగు

- సబ్సిడీ, ఆదాయం ఉన్నా ఆసక్తి చూపని రైతులు
- ముందుకు రావాలని అధికారుల సూచన



పట్టు పురుగుల పెంపకం

చిన్న, సన్నకారు రైతులకు పట్టు పురుగుల పెంపకం సులభమైనది. ఒక్కసారి పెట్టుబడితో కొన్నేళ్ల వరకు లాభాలు ఆర్జించవచ్చు. కేంద్ర ప్రభుత్వం షెడ్డు నిర్మాణానికి రూ. 2.4 లక్షల సబ్సిడీతో పాటు, ఎకరా మల్బరీ మొక్కలకు రూ. 30 వేల రాయితీ ఇస్తుంది. మొక్కల ఎదుగులకు అనువైన నేలలు ఉండి, పట్టు పురుగుల పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఉంటే నాణ్యమైన కకూన్స్ (పట్టు పురుగులు అల్లుకున్న గూళ్లు) వస్తాయి. దీంతో అధిక లాభాలు పొందవచ్చు. పట్టు పురుగుల గుడ్లు తెచ్చిన నాటి నుంచి 30 రోజుల్లో బ్యాచ్ పూర్తవుతుంది. రెండెకరాల మల్బరీ సాగుతో బ్యాచ్‌కు రూ. లక్ష వరకు ఆదాయం వస్తుంది. చాకి పెంపకం (పట్టు పురుగుల గుడ్ల నుంచి వచ్చే పిల్లల)తో మరింత ఆదాయం సంపాదించవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో 30 వేల డీఎఫ్‌ఎల్ చాకీ పెంపకం పిల్ల పురుగుల ధర రూ. 3,500 ఉంటే, మాములు గుడ్లు రూ. 1,300 ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన కకూన్స్ ధర క్వింటాల్‌కు రూ. 50 వేలు ఉంది. ప్రభుత్వం కిలోకు రూ. 75 అదనంగా చెల్లిస్తుంది. అయితే నాలుగేళ్లుగా అదనపు డబ్బులు చెల్లించడం లేదు. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని తిరుమలగిరి, జనగాంలో పట్టు పరుగుల కకూన్స్ కొనుగోలుకు మార్కెట్లు ఉన్నాయి. నాణ్యతను బట్టి వాటికి ధర ఉంటుంది. మేలు రకం కకూన్స్‌కు వందశాతం డబ్బులు చెల్లిస్తారు.

ప్రతీ నెల డబ్బులు



సేంద్రియ ఎరువులతో మల్బరీ సాగు చేస్తున్నా. పట్టు పురుగులకు లేత మల్బరీ ఆకులు మేతగా వేస్తే నాణ్యమైన కకూన్స్ వస్తాయి. పట్టు పురుగుల పెంపకంతో నెల నెల రాబడి వస్తుంది. సంవత్సరంలో తొమ్మిది బ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఏది ఏమైనా రెండెకరాలు మల్బరీ సాగుతో తయారైన బ్యాచ్‌తో ఖర్చులు అన్నీ పోనూ. రూ. 80 వేలు మిగులుతుంది.

– జూపల్లి జ్యోతిర్మయి, రైతు, చిలప్‌చెడ్

రైతులకు మంచి అవకాశం



జిల్లాలో పట్టు పురుగుల పెంపకం చాలా తక్కువ. రైతులు ఆసక్తి చూపకపోవడమే ఇందుకు కారణం. పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు గడించవచ్చు. చిన్న, సన్నకారు రైతులకు సెరికల్చర్ మంచి అవకాశం. పైగా ప్రభుత్వం సబ్సిడీ సైతం ఇస్తుంది. ఒక్కసారి పెట్టుబడితో ఎన్నో ఏళ్లుగా లాభాలు గడించవచ్చు. ఇప్పటికైనా రైతులు ముందుకు రావాలి.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యాన అధికారి

క్లుప్తంగా

మోడల్ స్కూల్ ప్రవేశపరీక్షలో ప్రవీణకు 19వ ర్యాంక్


వడ్ల ప్రవీణ

నర్సాపూర్‌రూరల్‌: మండలంలోని చిప్పల్‌తుర్తి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని వడ్ల ప్రవీణ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 19వ, జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించింది. ఆమెతో పాటు జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించిన 11మంది విద్యార్థులు మోడల్‌స్కూల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వడ్ల ప్రవీణ, పార్వతి, వర్థినిలతోపాటు మిగతా విద్యార్థినులను ఎంఈఓ తారాసింగ్, ఉపాధ్యాయులు అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్‌: పని కోసం ఇంట్లో నుంచి బయలుదేరిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొడకండ్లలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తలారి కర్ణాకర్(30) కవిత దంపతులకు రెండేళ్లలోపు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మేస్త్రీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే మేస్త్రీ పనికోసం కుకునూర్‌పల్లికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కర్ణాకర్ కారు అద్దంపై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కుకునూర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

సంగారెడ్డి క్రైమ్‌: వ్యక్తి అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేష్ కథనం ప్రకారం... పట్టణంలోని మగ్దంనగర్‌కు చెందిన షేక్ దస్తగిరి(42), పట్టణంలోని పలు హోటళ్లలో రోజు వారి కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు లాగే ఈనెల 3న ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి పనికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం భార్య సుల్తానా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

చిన్నశంకరంపేటలో లారీ క్లీనర్..

చిన్నశంకరంపేట(మెదక్‌): బాత్‌రూమ్ కోసం వెళ్లిన లారీ క్లీనర్ అదృశ్యమయ్యాడు. ఈ ఘటన నార్సింగి మండలం వల్లూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు... ఆంధ్రప్రదేశ్, కర్నూల్ జిల్లా సూదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురువ చిన్న రాయుడు(30) గొర్రెల కాపరిగా పనిచేస్తూనే లారీ క్లీనర్‌గా వెళ్తుంటాడు. ఈ నెల 17న సాయంత్రం బియ్యంలోడ్ తీసుకొని నాగ్‌పూర్‌కు లారీ డ్రైవర్ కరీముల్లాతో కలిసి బయలుదేరారు. 18న ఉదయం లారీ వల్లూర్‌కు చేరుకోగా, రాయుడు బాత్‌రూమ్‌కు వెళ్తానని చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో శనివారం సోదరుడు వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● రవి ప్రసాద్‌ది సిద్దిపేట.. ఆర్థిక పరిస్థితులు బాగా లేక పోవడంతో ఆత్మహత్యకు ప్రయత్నం చేశాడు. పరిస్థితి విషమంగా మారడంతో వైద్యులు హైదరాబాద్ గాంధీకి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ వారం తర్వాత అతడు చనిపోయాడు. విషయం తెలుసుకున్న ఇంటి యజమాని మృతదేహాన్ని తన ఇంటికి తేవద్దని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు నేరుగా హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో వైకుంఠధామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తదుపరి ప్రక్రియ నుంచి మొదలుకొని దశ దిన కర్మ వరకు కుటుంబం అంతా వైకుంఠధామంలో ఉండి, తర్వాత అద్దె ఇంటికి వెళ్లిపోయారు.



● పక్క ఫొటోలో ఉన్న కుటుంబం బతుకు దెరువు కోసం కామారెడ్డి జిల్లా నుంచి సిద్దిపేటకు వలస వచ్చింది. జిల్లా కేంద్రంలోని శంకర్ నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఇంటి పెద్ద దత్తయ్య అనారోగ్యంతో చనిపోయాడు. విషయం తెలుసుకున్న ఇంటి యజమాని అంతిమ సంస్కార ప్రక్రియ తన ఇంట్లో చేయొద్దని అభ్యంతరం వ్యక్తం చేశాడు. కన్న తండ్రి మృతదేహాన్ని సొంత ఊరికి తీసుకెళ్లలేక ఇటు అద్దె ఇంట్లో చేయలేక కుమారుడు సంతోష్ నరకయాతన పడ్డాడు. కాలనీ వాసులు ఇంటి యజమానికి సర్ది చెప్పడంతో ఇంటి ముందు అంతిమ సంస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. తదుపరి దశదినకర్మ ప్రక్రియను అద్దె ఇంట్లో చేయొద్దని ఇంటి యజమాని తెగేసి చెప్పడంతో చేసేదేమీ లేక శ్రీరామ వైకుంఠధామంలో పది రోజులు కుటుంబం తలదాచుకుంది.

● అది కోవిడ్ ఉధృతి తగ్గి పరిస్థితులు చక్కబడుతున్న సమయం. పట్టణానికి చెందిన శ్రీనివాస్ కోవిడ్ బారిన పడి చనిపోయాడు. ఇంటి పెద్ద హఠాన్మరణంతో భార్య, ఇద్దరు పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉండటానికి వసతి లేకపోవడంతో వైకుంఠధామంలో కుటుంబం తలదాచుకుంది. అంతిమ సంస్కార ప్రక్రియ, తదుపరి కార్యక్రమాలన్నీ అక్కడే నిర్వహించారు. విషయం అప్పట్లో పత్రికల్లో ప్రచురితమైన నేపథ్యంలో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. తహసీల్దార్‌ను పంపించి వారికి డబుల్ బెడ్ రూమ్‌లో ఆశ్రయం కల్పించారు.

ఆఖరి మజిలీకి.. ఆపన్నహస్తం

అద్దె ఇంటివాసులకు అండగా శ్రీరామ వైకుంఠధామం

ఊరు పొమ్మంటుంది.. వైకుంఠ ధామం నేనున్నా రమ్మంటుంది. మానవ విలువలు లేని చోట ఉండొద్దని, మనిషిని గుర్తించని మనుషుల మధ్య అంతిమ సంస్కారాలు వద్దని, పది రోజుల పాటు తనవద్ద తల దాచుకొమ్మని వైకుంఠధామం అభాగ్యుల పాలిట ఆపన్న హస్తంగా మారింది. మూఢ నమ్మకాలతో మానవత్వం మంటకలుస్తున్న తరుణంలో ఎవ్వరూ లేని, గూడు వసతి కరువైన వారికి తాత్కాలిక వసతి కల్పించి అక్కున చేర్చుకుంది. ఇప్పటి వరకు సుమారు 80 కుటుంబాలకు ఆశ్రయం కల్పించి, అంతిమ సంస్కారం, దిన వార క్రతువుని నిర్వహించిన శ్రీరామకుంట వైకుంఠధామంపై సాక్షి ప్రత్యేక కథనం..


శ్రీరామ వైకుంఠధామం

- అంతిమ సంస్కార ప్రక్రియకు వసతి
- ఆఖరి క్రతువు అంతా ఇక్కడే
- కోవిడ్ సమయంలో కోకొల్లలు
- ఇప్పటి వరకు 80 కుటుంబాలకు ఆసరా

సిద్దిపేటజోన్‌: జిల్లా కేంద్రంలోని వేములవాడ కమాన్ మార్గంలో శ్రీరామకుంట వైకుంఠధామం ఉంది. దానికి అనుకొని ఒక భవనం ఏర్పాటు చేశారు. వైకుంఠ ధామం నిర్వహణ బాధ్యతలను పట్టణంలోని యువ వర్తక సంఘం సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. వివిధ కారణాలతో చనిపోయిన వారికి ఇక్కడే అంతిమ సంస్కార కార్యక్రమాలు నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు తమకు చెందిన వారి అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇక్కడికి తీసుకువస్తారు. సగటున ప్రతి నెల వంద మందికి ఆఖరి క్రతువు జరుగుతోంది.

పదేండ్ల క్రితం ఆలోచన..

చనిపోయిన వారికి అంతిమ సంస్కారం నిర్వహించేందుకు వచ్చే వారిలో.. అద్దె ఇంట్లో ఉండే వారి పరిస్థితిని పదేండ్ల క్రితమే వైకుంఠధామం నిర్వాహకులు గుర్తించి సమీపంలో ఒక భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. అద్దె ఇంటి వద్ద అంతిమ సంస్కార తంతు నిర్వహించలేని వారికి ఉచితంగా వసతి కల్పించాలని వైకుంఠధామం కమిటీ నిర్ణయించింది. పది రోజుల పాటు ఇక్కడే ఉండేలా అన్ని వసతులు కల్పించారు. పేదలు కోరితే ఉచితంగా బియ్యం, నిత్యావసర వస్తువులు కూడా అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటివరకు సుమారు 80 కుటుంబాలు ఇక్కడి భవనంలో ఉండి అంతిమ సంస్కార ప్రక్రియ తర్వాత జరిగే మూడు, ఐదు, పది రోజుల దిన వార ప్రక్రియలను నిర్వహించారు.


అభాగ్యుల వసతి గది

చేయూతగా...

వైకుంఠధామంలో అంత్యక్రియల ప్రక్రియ, తలదాచుకున్న వారికి యువ వ్యాపార సంఘం పేరిట కమిటీ చేయూత అందిస్తోంది. వసతిగదిలో ఉన్న వారికి ఉచితంగా ఆవాసం, వైకుంఠరథం ఉచితంగా ఏర్పాటు చేస్తుంది. పేద అభాగ్యులకు అంతిమ సంస్కార నిర్వహణకయ్యే ఖర్చులు, నిత్యావసర సరుకులను అందిస్తుంది. ఇటీవల ఒక కుటుంబానికి పట్టణ వర్తక సంఘం సహకారాన్ని తీసుకుని రూ.51వేల నగదు, బియ్యం తదితర సామగ్రిని అందించారు.


వైకుంఠరథం

సంతృప్తిగా ఉంది


రత్నాకర్


చిరంజీవి

వైకుంఠధామానికి వచ్చే వారికి ఉండటానికి వసతులు కల్పించాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో అద్దె ఇంట్లో ఉండి తమవారి అంతిమ సంస్కార ప్రక్రియ చేయలేని వారి సమస్యను గుర్తించి భవనం నిర్మించాం. ఇక్కడే ఉండి దశదిన కర్మ ప్రక్రియ చేసేలా వసతులు కల్పించాం. వారు కోరితే ఏ సాయం అయినా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇప్పటి వరకు 80 కుటుంబాలకు వసతి కల్పించాం.

వైకుంఠ ధామం నిర్వహణ కమిటీ ప్రతినిధులు

నల్లమందు, గంజాయి స్వాధీనం

కొండాపూర్ (సంగారెడ్డి): గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తా వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్, సంగారెడ్డి పోలీసులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. కార్‌లో బీదర్ నుంచి అక్రమంగా గంజాయి తీసుకొస్తున్న.. జిన్నారం మండలం పుట్టగూడ కొండకంచి గ్రామానికి చెందిన చిట్టబోయిన శివ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 1.105 కిలోల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్, కార్‌ను స్వాధీనం చేసుకొని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. వాహన తనిఖీలలో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్, స్టేషన్ టీం ఎస్సైలు అనుదీప్ , హనుమంతు, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, కానిస్టేబుల్స్ సుభాష్ , పండరి, రాజేష్ అరుణ జ్యోతి పాల్గొన్నారు.


కొండాపూర్ : శివకుమార్‌ను అదుపులోకి తీసుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు

తూప్రాన్ పట్టణంలో..

తూప్రాన్‌: పట్టణంలో వేర్వేరు చోట్ల గంజాయి, నల్ల మందును ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు తనిఖీల్లో పటుకున్నారు. గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో పట్టణంలోని 12వ వార్డు హైదర్‌గూడకు చెందిన బుర్ర జితేందర్ వద్ద 300 గ్రాముల గంజాయి 41 ప్యాకెట్లు లభించాయి. నిందితుడిని అరెస్టు చేశారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు ఎల్లయ్య, చంద్రయ్య, కానిస్టేబుల్స్ రాజు, రవి, నవీన్, నరేశ్, హరీశ్ పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద నల్లమందు...

ట్రావెల్ బస్సులో నల్ల మందును తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గాంధీ నాయక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ట్రావెల్ బస్సులో రాజస్థాన్‌కు చెందిన రామ్‌దాయాల్ వద్ద 398 గ్రాముల ఓపీఎం (నల్లమందు) పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, మొబైల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల ఆరుగురు ఆత్మహత్య

బోర్లు వేసి.. అప్పులపాలై రైతు..

దుబ్బాకటౌన్‌: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో చోటుచేసుకుంది. బేగంపేట పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జాల సుధాకర్ (39) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా రూ. 2 లక్షలు అప్పులు చేసి వ్యవసాయ పొలంలో దాదాపు మూడు బోర్లు వేశాడు. అప్పులు తీర్చే మార్గం కనబడక తరచూ బాధపడుతుండేవారు. ఈనెల 20న తీవ్ర మనస్తాపానికి గురై తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. గమనించిన భార్య స్థానికుల సహాయంతో గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆర్వీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు డబ్బులు తిరిగివ్వడం లేదని..


యాదగిరి(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్‌): అవసరానికి ఇచ్చిన డబ్బులు తిరిగివ్వడం లేదన్న మనస్తాపంతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నార్సింగి మండలం సంకాపూర్ గ్రామంలో శనివారం వెలుగు చూసింది. ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బైకరి యాదగిరి(42) తన పాలివారైన ఐలయ్యకు రూ.3లక్షల70 వేలు అప్పుగా ఇచ్చాడు. తిరిగి ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఆయన స్పందించలేదు. ఇచ్చిన అప్పు తిరిగి వచ్చేలా కన్పించడం లేదని, తన అవసరాల తీరేది ఎలా అనే మనస్తాపంతో యాదగిరి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరాడు. అతడి భార్య లక్ష్మి భర్తకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. దీంతో బంధువులకు, తెలిసినవారికి ఫోన్ చేస్తే రాలేదని చెప్పారు. గ్రామ శివారులో వెతకగా శుక్రవారం రాత్రి బైక్ లభించింది. దీంతో శనివారం ఉదయం బైక్ లభ్యమైన ప్రదేశంలో వెతకగా చెట్టుకు ఉరివేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలే ప్రాణం తీశాయి..

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామ శివారులో చోటు చేసుకొంది. బీదర్ రైల్వే ఏఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం... బసంత్‌పూర్ గ్రామానికి చెందిన ఏనుగుల సంపత్(41) గ్రామ పంచాయతీలో వర్కర్‌గా పని చేస్తున్నాడు. తరచూ భార్య సుజాతతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో భార్య మూడు నెలల క్రితం పిల్లలతో పుట్టినిల్లైన బీదర్‌కు వెళ్లిపోయింది. ఇంటికి రావాలని భార్యను పలుమార్లు కోరాడు. తాను బసంత్‌పూర్‌కు రానని, నువ్వు కూడా ఇక్కడే ఉండి నిత్యం పనికి వెళ్లి డబ్బులు తీసుకొచ్చి ఇవ్వాలని భార్య తెలిపింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన సంపత్ శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత బీదర్ నుంచి జహీరాబాద్ వెళ్లే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

తాగుడుకు బానిసై యువకుడు..

మనోహరాబాద్(తూప్రాన్‌): తాగుడుకు బానిసైన యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ వివరాల ప్రకారం... మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన బోల్లబోయిన మహేష్‌యాదవ్ (29) తాగుడుకు బానిసై తల్లి లక్ష్మిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో తల్లి తన పెద్ద కూతురు ఊరు శాలిపేటకు వెళ్లి ఉంటోంది. ఈ క్రమంలో తల్లి శనివారం ఇంటికి రాగా ఇంట్లో కుమారుడు సీలింగ్‌కు ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. వెంటనే విషయాన్ని పోలీసులకు చెప్పగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో చోట యువకుడు..

బెజ్జంకి(సిద్దిపేట): మద్యానికి బానిసై యువకుడు మృతి చెందిన ఘటన బెజ్జంకిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భీవండిలో భాగ్య తన భర్త శేఖర్, కుమారుడు అక్షయ్(30)లతో కలిసి ఉండేది. భర్త మద్యం తాగుతున్నాడని భాగ్య గొడవపడి నాలుగేళ్ల క్రితం కుమారుడిని తీసుకుని బెజ్జంకి శివారులోని పాపన్నపల్లెకు వచ్చింది. ఇక్కడ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. కుమారుడు సైతం అతిగా మద్యం సేవిస్తూ గొడవ పడి 5రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లాడు. ఈ క్రమంలో కూలీ పని చేస్తు వచ్చిన డబ్బులతో మద్యం తాగి అతడు మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌ఓ శంకర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

కౌడిపల్లి(నర్సాపూర్‌): గడ్డి మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కొట్టాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రందెల్లి నర్సమ్మ(35)కు అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. దీనికితోడు భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈనెల 11న ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు మెదక్ ప్రవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

ఆటోను ఢీకొట్టి యువకుడు మృతి

మరొకరికి గాయాలు


ఆనంద్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్‌: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బీడీఎల్ భానూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... వెంకటాపురం గ్రామం నారాయణఖేడ్‌కు చెందిన దొడ్ల ఆనంద్ (23) హైదరాబాద్‌లోని మెహిదీపట్నంలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం తన స్నేహితుడు సుధీర్ కుమార్‌తో కలిసి స్కూటీపై బోరంచలో జాతరకు ఇద్దరు బయలుదేరారు. ఈ క్రమంలో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి.. పాటి గ్రామ శివారులో గల ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు గాడియం స్కూల్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో స్కూటీ నడుపుతున్న ఆనంద్‌కు తీవ్ర గాయాలవ్వగా, వెనకాల కూర్చున్న సుధీర్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆనంద్‌ను అంబులెన్స్‌లో పటాన్ చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

■ భూములు & ప్లాట్లు కొనబడును. హైద్రాబాద్‌లోని మహేశ్వరం, మన్సాన్‌పల్లి, పులిమామిడి, తుక్కుగూడ, నాగారం, దుబ్బచర్ల, శ్రీశైలం హైవే. 9966521191 [SCA25004154]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును.స్పాట్ క్యాష్. 9389214214 [H-783416]

BUSINESS OFFER

■ Need Monthly Returns? Get International Capital Market Trading, Profit sharing / Fixed profit, Safe &Secure. 9392151984 [SCA25004033]

WANTED

■ త్రివేణి హోమ్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీతం: 18k. Ph: 9640400073, 9160900024 [SCA25004117]

■ Walkin interview for 10th class, Intermediate, Graduates, Mechanics for gated community near Miyapur, Hyderabad. Ph 7989896938 [HA-11861]

■ Interested Candidates (including retired bank staff) may apply to work in Bhadradri Co-operative Urban Bank Ltd., Khammam. For details refer website www.bhadradribank.com, Last Date: 31-05-2025. Contact No. 96033 66343. [MH-13471]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉద్యాన సాగుకు ఊతం

పండ్లు, కూరగాయల సాగుకు రాయితీ

- ఆయిల్ పామ్‌పై రైతుల ఆసక్తి
- డ్రిప్ సేద్యానికి సబ్సిడీ
- ఎస్సీ ఎస్టీలకు వంద, బీసీలకు 90 , ఇతరులకు 80 శాతం
- అవగాహన కల్పిస్తున్న అధికారులు


కొండాపూర్ మండలం తేర్పోల్ గ్రామంలో పామాయిల్ తోటను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

సంగారెడ్డి: రైతు లేనిదే రాజ్యం లేదు.. రైతు బాగుంటేనే అందరు బాగుంటారని.. ఆ దిశగా రైతుల మేలు కోసం వారి ఆదాయం పెరిగేలా ప్రభుత్వం ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తోంది. ఎంతో లాభదాయకమైన పండ్లు, కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు రైతులకు రాయితీ కల్పిస్తూ ఉద్యాన శాఖ ప్రణాళిక రూపొందించింది. కొన్ని పంటల సాగుకు ప్రత్యేక సబ్సిడీ సదుపాయాన్ని కల్పించారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జిల్లాలో రైతులకు సిరులు అందించే ఆయిల్ పామ్‌పై ప్రభుత్వం దృష్టి సారించింది. 2025– 26 సంవత్సరానికి గాను ఉద్యాన శాఖ ద్వారా వివిధ పథకాల కింద రైతులకు రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆసక్తిగల రైతులు సంబంధిత ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొంది.

ఉద్యాన పంటలకు రాయితీ...

వర్షాభావ పరిస్థితుల్లో పండ్ల తోటలకు, దీర్ఘకాలిక పంటలకు నీటి తడులు అందించడానికి నీటికుంటలు నిర్మించేందుకు రూ.75వేలు రాయితీ ఇస్తారు. మొక్కలకు అనుకూల సూక్ష్మ వాతావరణ పరిస్థితులు కలగజేస్తూ నేల ఉష్ణోగ్రతలను నివారించడానికి, భూమిలో తేమ నిల్వ ఉంచడానికి మల్చింగ్ అనే పద్ధతి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మల్చింగ్ వేసుకున్న రైతులకు ఎకరానికి రూ.8 వేలు సబ్సిడీ ఇవ్వనున్నారు.

వివిధ పథకాల వివరాలు...

మైక్రో ఇరిగేషన్: ఈ పథకం ద్వారా బిందు, తుంపర సేద్యానికి లక్ష్యాలు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం చొప్పున రాయితీపై ఆయిల్ పామ్ సాగుకు నిధులు ఇవ్వనున్నారు. కూరగాయలు, మిరప, మొక్కజొన్న మొదలగు పంటలకు సైతం రాయితీ ఇస్తారు.


రాష్ట్రీయ ఉద్యాన మిషన్: ఈ పథకం ద్వారా వివిధ పండ్ల తోటలు.. బొప్పాయి, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో సాగుకు రాయితీ సదుపాయం కల్పిస్తున్నారు.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన: ఈ పథకం ద్వారా తీగ జాతి కూరగాయలు సాగుకు పందిళ్ల నిర్మాణానికి 50 శాతం రాయితీతో గరిష్ఠంగా ఒక రైతుకు 2.50 ఎకరాల వరకు, ఎకరాకు రూ.లక్ష రాయితీ సదుపాయం కల్పిస్తున్నారు. అలాగే రాష్ట్ర వెదురు మిషన్ ద్వారా వెదురు సాగు చేసే వారికి 50శాతం రాయితీ కింద (మొక్కకి రూ.90) చొప్పున ఎకరాకు గరిష్ఠంగా 130 మొక్కల వరకు రాయితీ సొమ్మును ఖాతాలో జమ చేస్తారు.

ఆయిల్ పామ్ ప్రాముఖ్యం.. లాభాలు

- నీటి సదుపాయం ఉన్న అన్ని భూముల్లో పామాయిల్ పంట వేయొచ్చు.
- ఇద్దరు కూలీలతో 10 ఎకరాల పంట సులభంగా సాగు చేయవచ్చు.
- అకాల వర్షం, ప్రతికూల వాతావరణంలోనూ ఎటువంటి నష్టం వాటిల్లదు
- చీడపీడల బెడద చాలా తక్కువగా ఉంటుంది.
- తొలి మూడేళ్లలో అంతర పంటలు పండించి ఆదాయం పొందవచ్చు.
- పంటను ప్రభుత్వం కేటాయించిన సంస్థ ద్వారా కచ్చితంగా కొనుగోలు చేస్తుంది.
- ప్రతి 15 రోజులకు నిరంతర ఆదాయం ఇలా 25 సంవత్సరాల వరకు వస్తుంది.
- ప్రభుత్వం డ్రిప్, మొక్కలకు సబ్సిడీ ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తుంది.
- పంట నిర్వహణకు ఎకరానికి ఒక సంవత్సరంలో ప్రభుత్వం ద్వారా రూ.4,200 అందిస్తుంది. ఇలా 4 సంవత్సరాలకు ఒక ఎకరానికి ప్రభుత్వం రూ.16,800 ప్రోత్సాహంగా ఇస్తూ సాగు విస్తీర్ణాన్ని ప్రోత్సహిస్తోంది.

రైతులు ముందుకు రావాలి



జిల్లాలో రైతులు ఉద్యాన పంటలను సాగు చేయాలి. సాగు చేసే రైతులు పథకాలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలి. ఆసక్తి గల రైతులు తమ పరిధిలోని ఉద్యాన అధికారులను లేదా సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. కొత్తగా పండ్ల తోటలు పెట్టి రాయితీ పొందాలనుకునే రైతులు వారి పేర్లను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద హార్టీకల్చర్ పోర్టల్‌లో విధిగా నమోదు చేసుకోవాలి.

– సోమేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి, సంగారెడ్డి